క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ మోకా రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరు నామినేషన్ల దాఖలు



ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అంగాడి రేవతి

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఏడో రోజు గురువారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) తరఫున రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా రాయుడు శ్రీరామచంద్రమూర్తి, అంగాడి రేవతి, టేకుమూడి వెంకటరావు, దంగేటి రామకృష్ణ, సత్తిరాజు ఎస్వీయూవీఆర్ఎస్ స్వాములు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావుకు అందజేశారు.

మాజీ సర్పంచ్ వరలక్ష్మి మృతి



దంగేటి వరలక్ష్మి(ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని అనాతవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకురాలు దంగేటి వరలక్ష్మి(62) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త సత్యనారాయణ, కుమారుడు పండు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిదిండి గాలంనాథ్, ఎంపీటీసీ సభ్యుడు పులిదిండి సుజాత, నక్కా సర్వేశ్వరరావు, దంగేటి సురేష్, దూనబోయిన వెంకటరావు తదితరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

వైభవంగా వేంకటేశ్వరుని పుష్పోత్సవం



స్వామి వారికి బుక్కా ఉత్సవం నిర్వహిస్తున్న దేవస్థానం చైర్‌పర్సన్ విరీతాదేవి, భక్తులు

అమలాపురం టౌన్: గత పది రోజులుగా జరుగుతున్న అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి జరిగిన పుష్పోత్సవంతో ముగిశాయి. బుధవారం రాత్రి స్వామివారికి బుక్కా ఉత్సవం, ఉయ్యాల సేవ శాస్త్రోక్తంగా జరిగాయి. రకరకాల పూలు, మిఠాయిలతో స్వామి ఎదుట ఉంచి పుష్పోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు పర్యవేక్షణలో ముగింపు ఉత్సవాలు జరిగాయి. అబ్బిరెడ్డి సురేష్, సంధ్యారాణి దంపతులు చేతుల మీదుగా ఉయ్యాలసేవ, పుష్పోత్సవం క్రతువులు జరిగాయి. దేవస్థానం ధర్మకర్తలు యెండూరి రాఘవ, నడింపల్లి వర్మ, ముంగర ప్రసాద్, కాశే చంటితో పాటు పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పాటలపై శిక్షణ

యానాం: స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ కేంద్రంలో జనవిజ్ఞానవేదిక యానాం శాఖ ఆధ్వర్యంలో గురువారం దేశభక్తి, సైన్స్ సంబంధిత పాటలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ప్రజానాట్య మండలి సభ్యులు సురేష్, కె.సత్యనారాయణలు పాటల భావానికి అనుగుణంగా రాగయుక్తంగా ఎలా పాడాలో పలువురికి శిక్షణనిచ్చారు. కోటిపల్లి భాగ్యవతి నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని జనవిజ్ఞానవేదిక యానాం శాఖ ప్రతినిధులు కేవీవీ సత్యనారాయణ, దాట్ల దేవదానం రాజు పర్యవేక్షణలో శిక్షణ నిర్వహించారు.

అడ్మిషన్ల నిర్వహణకు సమగ్ర విధానం

యానాం: మెడికల్, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు అడ్మిషన్లు నిర్వహించేందుకు సమగ్ర విధానాన్ని రూపొందిస్తున్నట్లు సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ(సెంటాక్) అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా అడ్మిషన్ల నిర్వహణ సులభ రీతిలో ఉండేలా ప్రణాళికను రూపొందించామన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, బుక్‌లెట్ సమాచారం సిద్ధం చేశామన్నారు. నాన్ నీట్ విద్యార్థులకు వచ్చే నెల రెండో వారంలో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేపడతామన్నారు. యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో వివిధ కళాశాలల్లో 5,464 ఒకేషనల్ కోర్సుల సీట్లతో పాటు ఎంబీబీఎస్ సీట్లను సెంటాక్ భర్తీ చేయనుందన్నారు. 426 లేటరల్ ఇంజినీరింగ్ సీట్లను, 4,260 సైన్స్ అండ్ ఆర్ట్స్ సీట్లను, 175 డిప్లొమో సీట్లను మొత్తం మీద అన్ని కోర్సులకు కలిపి 10,415 సీట్లను సెంటాక్ భర్తీ చేయనుందని తెలిపారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్
- డి.రావులపాలెం, గుండెపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



డి.రావులపాలెం ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్



జనసేన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ఇంటింటికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా చేరాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని డి.రావులపాలెం, గుండెపూడి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత సావరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి వివిధ సంక్షేమ పథకాలు ద్వారా ఆర్థిక భరోసా కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధికి బాటలు వేశామని, ప్రజల తాగునీటి ఇబ్బందులు తీర్చామన్నారు. ప్రజల పక్షాన, ప్రజల కోసం పాటు పడే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని అన్నారు. అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బళ్లవారిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్‌కు మహిళలు మంగళ హారతులిచ్చి పూలు చల్లి స్వాగతం పలికారు. తొలుత ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద మంత్రి విశ్వరూప్ జనసేన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి విశ్వరూప్‌కు మద్దతుగా ఆయన కుమారులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌లు ఎన్నికల ప్రచారం చేశారు. సావరం, బళ్లవారిపేట, డి.రావులపాలెం, గుండెపూడి, పోతులవారిపేట, అగ్నికుల క్షత్రియపాలెంలో ఎన్నికల ప్రచారం సాగింది. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉంగ్రు సుదర్శనరావు, సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, బళ్ల శివ, తిక్కా బాబి, గుంటూరి బాలరాజు, కొపనాతి వెంకటేశ్వరరావు, పినిపే ప్రకాశరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కృష్ణంరాజు, గోళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతికి యూటీఎఫ్ అభినందన



విద్యార్థిని ప్రశాంతిని అభినందిస్తున్న పట్టణ యూటీఎఫ్ ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బద్రి ప్రశాంతి 600 మార్కులకు గాను 587 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమంగా నిలిచినందుకు ఆమెను పట్టణ యూటీఎఫ్ అభినందించింది. పట్టణ యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బి.చంద్రకళ, కె.పరమేశ్వరరావు తదితర ఉపాధ్యాయులు పాఠశాలలో విజేత ప్రశాంతి కనబరిచిన ప్రతిభను గురువారం ప్రశంసించారు. విద్యార్థిని ప్రశాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీశంకర్‌లను యూటీఎఫ్ ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, బి.రామకృష్ణ, బీఎస్, వెంకటేశ్వరరావు, జీవీ రాజేశ్వరి, ఎన్.గంగరాజు తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సీపీలో 450 మంది చేరిక



తాళ్లరేవులో పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ, పితాని



గెద్దం శేఖర్‌కు కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: తాళ్లరేవు ఎన్నికల ప్రచారం సందర్భంగా స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మల్లాడి చిన్నా అలియాస్ మాస్ సమక్షంలో 200 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక కేశవస్వామి కాలనీలో స్థానిక నాయకులు రెడ్డి రెడ్డిబాబు, కొప్పిశెట్టి శ్రీనివాస్, తాడి భైరవస్వామి, పితాని గోవిందుల ఆధ్వర్యంలో 150 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి సుమారు 100 మందికి పితాని బాలకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, పెమ్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, బూరెల వెంకట్రాజు, విత్తనాల పండు, దడాల జగదీశ్వరరావు, అంకాడి అంజిబాబు, పెయ్యల మంగేష్, ముద్దన వెంకట శివరామ ప్రసాద్, కోరుకొండ కిరణ్‌కుమారి, పెస్సింగి బ్రదర్స్, మోర్త రాంబాబు, పిల్లి మణికంఠ, కొటికెలపూడి చందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

ముమ్మిడివరం: మండలంలోని కమిని పంచాయతీ మాజీ సర్పంచ్ గెద్దం శేఖర్ తన అనుచరులతో కలిసి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, పెయ్యల చిట్టిబాబు, మట్టపర్తి సత్యనారాయణ, రెడ్డి శివన్నారాయణ, బొంతు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- తాళ్లరేవులో ఎన్నికల ప్రచారం



తాళ్లరేవులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ తదితరులు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు

తాళ్లరేవు: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. గురువారం ఆయన మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామ పంచాయతీలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. పలు ప్రాంతాల్లో మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన జరుగుతుందని, అది కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తనను ఎమ్మెల్యేగా, రాపాక వరప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, కాశి బాలమునికుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు రత్న ముత్యాలు, నందికోళ్ల శ్రీదేవి, చిట్టూరి చలపతి, కాటంశెట్టి రామ్మూర్తి, రేవు మల్లీశ్వరి, బొంతు మోహన్, పెట్ల సూర్యనారాయణరాజు, మోకా మధుబాబు, వెంటపల్లి వాసంతి, పెట్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ విజయం తథ్యం



పోరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పొన్నాడ తల్లి రామనుజమ్మ, సతీమణి నీరజ

కాట్రేనికోన: రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం తథ్యమని ముమ్మిడివరం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తల్లి రామానుజమ్మ అన్నారు. పల్లంకుర్రు పంచాయతీ పోర, నడవపల్లి, కర్రివానిరేవు, చింతవానిరేవులో గ్రామాల్లో గురువారం ఆమె తన కోడలు నీరజ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు వారికి మంగళ హారతులతో బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ తల్లి రామానుజమ్మ మాట్లాడుతూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తన బిడ్డను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పొన్నాడ సతీమణి నీరజ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పొన్నాడ కుటుంబ సభ్యులు పొన్నాడ గంగాధరరావు, పొన్నాడ ఉమా మహేశ్వరి, కర్రి వాణి, మాధవి, కొల్లాటి లక్ష్మి, కర్రి అన్నారావు, దాసరి కాసుబాబు, ఓలేటి భగవాన్, కొండ, కొప్పాడి వెంకట్రావు, నాతి అలివేణి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా ప్రచారం



అమలాపురం ఒకటో వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్ భార్య బేబీ మీనాక్షి



అమలాపురంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన డాక్టర్ శ్రీకాంత్

మంత్రి విశ్వరూప్‌కు మద్దతుగా భార్య, కుమారుల ప్రచారం

అమలాపురం టౌన్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు మద్దతుగా ఆయన కుటుంబీకులు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అమలాపురం పట్టణంలో విశ్వరూప్ భార్య బేబీ మీనాక్షి, కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ వేర్వేరుగా ప్రచారాలు చేస్తున్నారు. ఇప్పటికే మంత్రి పెద్ద కుమారుడు కృష్ణారెడ్డి నియోజకవర్గంలో ప్రచారం సాగిస్తున్నారు. స్థానిక 13వ వార్డులో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో కలిసి మంత్రి విశ్వరూప్ కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. ఇంటింటికీ వెళ్లి తన తండ్రి విశ్వరూప్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని శ్రీకాంత్ ఓటర్లను అభ్యర్థించారు. మంత్రి విశ్వరూప్ భార్య బేబీ మీనాక్షి స్థానిక ఒకటో వార్డు నుంచి ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రీకాంత్ వెంట వైఎస్సార్ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే బేబీ మీనాక్షి ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, యండమూరి గంగ, యన్నాబత్తుల పద్మ, గోపి రాజీ, చిత్రపు రామకృష్ణ, వంటెద్దు వెంకన్నాయుడు, సుంకర సుధ, కల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామ పరిధి తలుపులతోటలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి నరెడ్ల పాపారావుకు చెందిన డాబా ఇల్లు దగ్ధమైంది. ఇళ్లంతా మంటలు వ్యాపించడంతో పాపారావు కుటుంబీకులు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంటిలోని మంచం, ఫర్నీచర్, నగదు, బంగారం, ఏసీ, వివిధ ధ్రువపత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇల్లు కాలి బూడిదవ్వడంతో పాపారావు కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ప్రమాదంలో రూ.3 లక్షలకు పైబడి నష్టం సంభవించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నూతన గృహాలకు రూ.5 లక్షలు

యానాం: నియోజకవర్గ పరిధిలో షెడ్యూల్డ్ కులాలకు నిర్మించిన 229 గృహాలు శిథిలస్థితికి చేరుకోవడంతో వాటి స్థానంలో నూతన గృహాల కోసం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయానికి ఆదిద్రావిడ శాఖ ఆమోదం తెలిపిందని అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమస్యపై పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అనేకసార్లు వినతిపత్రాలివ్వడంతో ఆది ద్రావిడ శాఖ అధికారులు స్పందించారన్నారు. ఇప్పటికే శిథిలస్థితికి చేరుకున్న గృహాలను సర్వే చేసి నివేదిక ఇచ్చారని, దాని ఆధారంగా ఆర్థిక సాయం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. సమావేశంలో తిరుకోటి నాగేశ్వరరావు, గుర్రపు ప్రహ్లాదుడు, నామాడి అప్పారావు, కోరుకొండ రాజేంద్రప్రసాద్, మట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యానాం విచ్చేసిన విద్యాశాఖ డైరెక్టర్

యానాం: పుదుచ్చేరి విద్యాశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని గురువారం యానాం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద ప్రాంతీయ విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. శుక్రవారం ఆమె నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలను పరిశీలించడంతో పాటు సీబీఎస్ఈ సిలబస్ అమలు తీరు, పదో తరగతి ఉత్తీర్ణతా శాతం, పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందితో సమీక్షించనున్నారు. మధ్యాహ్న భోజనం అందించే సెంట్రల్ కిచెన్‌ను సైతం ఆమె పరిశీలించనున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఐ పోలవరం: ఈ నెల 20, 21 తేదీల్లో నెల్లూరులో జరిగిన 7వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడరన్ పెంటాథ్లాన్ లేజర్ రన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మల్లాడి భాగ్యలక్ష్మి, ఓలేటి రాజు, దుర్గాప్రసాద్, నాగూర్, సంగాని రాజు, సంగాని వెంకటసాయి, రచ్చా రాము, దండుప్రోలు రాజు, ఉప్పాడి కనకమహాలక్ష్మి ప్రతిభ కనబరిచారని జి.మూలపొలం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.జనార్ధనరావు గురువారం తెలిపారు. వారిలో మల్లాడి భాగ్యలక్ష్మి, ఓలేటి రాజులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులు, కోచ్ రాయపురెడ్డి బాబిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పాఠశాల ప్రవేశ వయసుపై సందిగ్ధత

యానాం: యానాంతో పాటు పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో సీబీఎస్ఈ సిలబస్ అమలవుతున్న నేపథ్యంలో విద్యార్థుల స్కూల్‌లో ప్రవేశ వయస్సుపై సందిగ్ధత నెలకొనడంతో విద్యాశాఖాధికారులు ప్రభుత్వ నిర్ణయంపై వేచి చూసే పరిస్థితి వచ్చిందని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ముఖ్యంగా నూతన విద్యావిధానం-2020లో చిన్నారులు మూడేళ్ల అంగన్‌వాడీ విద్య (ప్రీస్కూల్), రెండేళ్ల పాటు ప్రథమ, ద్వితీయ తరగతులు చదవాలని పేర్కొంది. అయితే గత ఏడాది విద్యాశాఖలో భాగమైన కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాస్తూ సీబీఎస్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని స్కూల్స్ ఒకటో తరగతిలో చేర్చుకోవడానికి తప్పనిసరిగా 6 ఏళ్లు పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకటి నుంచి ఐదో తరగతులకు నూతన కరికులమ్‌ను అమలులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో మరో పక్క కేంద్రీయ విద్యాలయ, కేంద్రీయ పాఠశాలలు ఒకటో తరగతిలో చేర్చుకునేందుకు 6 ఏళ్లు నిండాలని పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గందరగోళ పడుతున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్ దెబ్బతినకుండా ప్రభుత్వం నిర్దిష్ట విధానాన్ని ప్రకటించాలని కోరుతున్నారు. మరో వైపు 2022లో సుప్రీం కోర్టు సైతం చిన్న వయస్సులో పాఠశాలలో చేర్చడం వల్ల వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం గురించి స్పష్టం చేసిందని చెబుతున్నారు.

ప్రస్తుతం పాత పద్ధతినే ..

యానాం నియోజకవర్గ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి 5 ఏళ్లు పూర్తయిన వారికి అడ్మిషన్ ఇస్తున్నట్టు ప్రస్తుతానికి పాత పద్ధతినే అనుసరిస్తున్నామని విద్యాశాఖ డైరెక్టరేట్ తెలిపారని యానాం విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ సాక్షికి వివరణ ఇచ్చారు. నూతన విధానాన్ని అమలుకు ఎన్నికలైన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారన్నారు. అదేవిధంగా యానాంకు గురువారం పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రియదర్శిని రానున్నారని సమాచారం వచ్చిందన్నారు.

మలేరియాను తరిమికొడదాం



మానవహారం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

ఐ.పోలవరం: అందరం ఏకమై మలేరియాను తరిమికొడదామని జి.వేమవరం, కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి మానవహారం ఏర్పాటుచేయడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వల్ల వచ్చే వ్యాధులు, దోమల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు డి.శివగాయత్రి, కె.ఇందిరాశ్రీ, ఎంఎస్ రాజేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'గురుకుల' ప్రవేశ పరీక్షలు

అమలాపురం టౌన్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి అమలాపురంలో మూడు పరీక్షా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలిక ఉన్నత పాఠశాలలు, వెత్సా వారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు జరిగినట్లు డీఈఓ ఎం.కమలకుమారి తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు జరిగిన ప్రవేశ పరీక్షల కోసం 77 మంది, జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్షకు 474 మంది, డిగ్రీ కళాశాలకు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే ప్రవేశ పరీక్షలకు 5, 6, 7, 8 తరగతులకు 21 మంది, జూనియర్ కళాశాలలకు 380 మంది, డిగ్రీ కళాశాలలకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఓఎంఆర్ జవాబు పత్రాలను ప్రత్యేక వాహనంలో గుంటూరుకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ప్రవేశ పరీక్షల ఫలితాలు త్వరలోనే వెల్లడవుతాయని డీఈవో కమలకుమారి తెలిపారు.